
MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 262 | పేజీలు : 8 | గురువారం 10 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



ప్రతీకారం తీర్చుకోవాలంటే
నిమిషం చాలు... కానీ!

- నన్ను ఇబ్బంది పెట్టినట్టే... పవన్ కల్యాణ్‌నూ వేధించారు
- నా అక్రమ అరెస్టును నిరసిస్తూ నాడు చేపట్టిన ప్రజాందోళనలతో బాధ్యత మరింత పెరిగింది
- నాపై చేసిన ఆరోపణలు రుజువు చేయలేకపోయారు... అదే నా నిబద్ధత
- అధికారంలో ఉండగా అరాచకం.. ఓటమి చెందాక కుట్రలు గొడ్డలి పార్టీ విధానం
- నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు... ఏపీపీఎస్సీలో అక్రమాలతో యువతను మోసం చేశారు
- గొడ్డలి పార్టీ కుట్రలకు ప్రజలే బుద్ధి చెప్పాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



పి.గన్నవరం, మహానగర్

రాజకీయ కక్షలకు తాను ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వనని, ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం సహనంతో, ఓపిగ్గా పనిచేయడం తనకు అలవాటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించిన అంశాలను గుర్తుచేస్తూ, మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న నాటి ప్రభుత్వం తనను అక్రమంగా అరెస్టు చేసిందని చంద్రబాబు తెలిపారు. నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన సమయంలో అర్ధరాత్రి తనను అరెస్టు చేస్తామని చెప్పారని, ఏ తప్పు చేయకపోయినా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారని గుర్తుచేశారు. తనపై అనేక ఆరోపణలు చేసినా వాటిని రుజువు చేయలేకపోయారని, అదే తన నిబద్ధతకు నిదర్శనమన్నారు. 48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 31 ఏళ్ల క్రితమే తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని చెప్పారు. తనకు ధన వ్యామోహం లేదని, తెలుగు జాతి అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే తన లక్ష్యమన్నారు. తాను జైలులో ఉన్న సమయంలో సంఘీభావంగా దేశవిదేశాల్లోని తెలుగు ప్రజలు స్పందించారని, డిప్యూటీ - మిగతా2లో




భారత్, రష్యా రక్షణ ఒప్పందం

- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్?!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

- కాంగ్రెస్ కంటే 7 రెట్లు ఎక్కువ
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.1,472.8 కోట్ల నిధులు
- కాంగ్రెస్ మొత్తం రూ.207.17 కోట్లు
- ఈసీకి సమర్పించిన ఖర్చుల వివరాల్లో వెల్లడి

5



5



విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

- సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది: సుప్రీంకోర్టు
- ఎన్‌సీఈఆర్‌టీపై కీలక వ్యాఖ్యలు చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని వెల్లడి
- అయితే వాటిని సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా వ్యక్తం చేయాలని సూచన

జరగబోయేది కురుక్షేత్ర సంగ్రామం

స్థానిక ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరిగినా పార్టీ శ్రేణులు గట్టిగా నిలబడి పోరాడాలని పిలుపు



- అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగం, అక్రమ కేసులు, అరెస్టులు వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి
- స్థానిక ఎన్నికలు జరుగుతాయో లేదో కూడా తెలియని పరిస్థితి ఉంది
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం వెనుక ఎన్నికలను వాయిదా వేయాలన్న ఉద్దేశం ఉంది
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరిగినా పార్టీ శ్రేణులు గట్టిగా నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగం, అక్రమ కేసులు, అరెస్టులు వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. బుధవారం పర్చూరు నియోజకవర్గ పార్టీ కేడర్‌తో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడారు. స్థానిక ఎన్నికలు జరుగుతాయో లేదో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం వెనుక ఎన్నికలను - మిగతా2లో

విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

- సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్
- రెండో కూటమి సమన్వయ సమావేశంలో నిర్ణయం
- ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందన్న తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు

5



భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రవాణా సౌకర్యాలేంటి?



- అఫిడవిట్ వేయాలని హైకోర్టు ఆదేశం
- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రవాణా సదుపాయాలపై న్యాయస్థానం ఆరా
- అన్ని అంశాల గురించి వివరాలు సమర్పించాలని ఆదేశాలు
- సమగ్ర వివరాలు కోరిన హైకోర్టు

అమరావతి, మహానగర్

విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రవాణా సదుపాయాలపై హైకోర్టు స్పందించింది. విశాఖపట్నం నగరం నుంచి ఈ కొత్త విమానాశ్రయానికి ప్రజా రవాణా (కనెక్టివిటీ) సరిగ్గా లేకపోవడం వల్ల ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా విమానాశ్రయం చేరుకునేందుకు - మిగతా2లో

సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు 'సి4' కేంద్రం

ప్రజల సైబర్ భద్రతకు కొత్త శక్తి
త్వరలో రాష్ట్రస్థాయిలో సైబర్ వార్ రూమ్
డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



విజయవాడ క్రైమ్, మహానగర్

ప్రజల డిజిటల్ భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు సైబర్ నేరాలపై సమర్థవంతంగా పోరాడేందుకు ఎన్‌టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (సి4)ను బుధవారం ప్రారంభించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ మూడో అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక నైపుణ్యాలతో సైబర్ నేరాల దర్యాప్తును వేగవంతం చేయడం, బాధితులకు న్యాయం అందించడం లక్ష్యంగా సి4 కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ తరహాలోనే సైబర్ నేరాలు కూడా తీవ్రంగా ఉన్నాయని అన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు 'సైబర్ గార్డ్' విధానాన్ని తీసుకురానున్నామని, త్వరలో రాష్ట్రంలో సైబర్ వార్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ కేంద్రాలతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో జిల్లాకు 20 మంది సైబర్ కానిస్టేబుళ్లను నియమిస్తున్నామని చెప్పారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు నుంచి నేరస్థుడి ఆనవాళ్ల వరకు ప్రతి సమాచారాన్ని విశ్లేషించి, ఆధారాలను అనుసరిస్తూ సైబర్ నేరాలను అరికట్టడమే సి4 కేంద్రం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సైబర్ ఎస్ఐలను నియమించి ఫిర్యాదుల దర్యాప్తుతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. సైబర్ సిబ్బందికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు పద్ధతులపై శిక్షణ ఇస్తామని చెప్పారు. 'ఖాకీ బాబు', 'సైబర్ చిట్టి' వంటి పాత్రలతో వీడియోలు, ప్రచార రథాలు, డ్రోన్‌ల ద్వారా ఆడియో సందేశాలతో ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.రవి ప్రకాష్, డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళ సర్టిఫికెట్‌కు కొత్త నిబంధనలు?

కౌన్సిలర్ సంతకం కోసం మహిళలకు ఇబ్బందులు
తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐ తీరుపై ఆరోపణలు



జగ్గయ్యపేట, మహానగర్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఒంటరి మహిళ పింఛన్ కోసం అవసరమైన సర్టిఫికెట్ జారీలో తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొత్త నిబంధనలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోర్టు ద్వారా పొందిన విడాకుల ధ్రువీకరణ పత్రం లేదా వివాహం కాలేదని ధ్రువీకరణతో పాటు భర్త వదిలివేసి ఒంటరిగా నివసిస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్ అవసరమని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. అయితే భర్తలను వదిలి ఒంటరిగా జీవిస్తున్న మహిళల వివరాలను వీఆర్వోలు స్థానికంగా విచారించి పంచనామా నివేదికను రూపొందించి ఆర్ఐకి పంపుతున్నప్పటికీ, కౌన్సిలర్ సంతకం తీసుకురావాలని ఆర్ఐ సూచిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫలానా కౌన్సిలర్ సంతకం తీసుకొస్తేనే సర్టిఫికెట్‌పై సంతకం చేస్తానంటూ మహిళలను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని పేర్కొంటున్నారు. వీఆర్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయిలో విచారణ, పంచనామా నిర్వహించిన తర్వాత కౌన్సిలర్ సంతకం ఎందుకు అవసరమో, రాజ్యాంగంలోని ఏ నిబంధన ప్రకారం ఈ సంతకం తీసుకోవాల్సి వస్తుందో అధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై వివరణ కోసం ఉన్నతాధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందించలేదని పేర్కొంటున్నారు. కూటమి నాయకులు చొరవ తీసుకుని అర్హులైన ఒంటరి మహిళలకు సర్టిఫికెట్లు త్వరితగతిన జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీకారం తీర్చుకోవాలంటే నిమిషం చాలు... కానీ!

-మొదటిపేజీ తరువాయి

సీఎం పవన్ కల్యాణ్ తనకు మద్దతుగా నిలిచిన విషయాన్ని ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. గత పాలకులు తనతో పాటు పలువురు నేతలను వేధించారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలని, అయితే తాను సహనంతో, ఓపికతో వ్యవహరిస్తున్నానని స్పష్టం చేశారు. అలిపిరిలో తనపై క్లైమోర్ మైన్లతో దాడి జరిగినా తన సిద్ధాంతాలను, లక్ష్యాన్ని మార్చుకోలేదన్నారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే ఉంటానని తెలిపారు. వైసీపీ గత పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపిస్తూ పోలవరం డయాఫ్రమ్ వాల్, వెలిగొండ ప్రాజెక్టు, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు, నాసిరకం మద్యం తదితర అంశాలను ప్రస్తావించారు. 2019--24 మధ్య రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతిందని, ఏపీపీఎస్సీ వ్యవహారాల్లో యువతకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. 2024లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని, కేంద్ర సహకారంతో పోలవరం, అమరావతి నిర్మాణాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఓవైపు అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షం అడుగడుగునా కుట్రపూరితంగా అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. మెగా డీఎస్సీకి సంబంధించి 350 కేసులు వేసి నియామకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తమ కుటుంబాలపై అసభ్యకర ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా తాము భయపడేది లేదని, ప్రజలకు మేలు చేసే విషయంలో వెనక్కి తగ్గబోమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నామని, ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుని పాలనలో లోపాలను ఎప్పటికప్పుడు సరిచేసుకుంటున్నామని తెలిపారు.

'పెలికాన్' గాల్వనైజ్డ్ స్టీల్ బ్రాండ్ ఆవిష్కరణ



విజయవాడ

నిర్మాణం, మౌలికసదుపాయాలు, తయారీ, ఇంజనీరింగ్ రంగాల అవసరాలను తీర్చేందుకు అర్సెలర్‌మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా) 'ఏఎం/ఎన్ఎస్ పెలికాన్' పేరుతో ప్రీమియం గాల్వనైజ్డ్ స్టీల్ బ్రాండ్‌ను ప్రారంభించింది. తుప్పు, క్షయం నుంచి రక్షణతోపాటు ఎక్కువకాలం మన్నిక, తక్కువ నిర్వహణ అవసరమయ్యే ఉక్కు పరిష్కారాలను అందించడమే దీని లక్ష్యమని సంస్థ తెలిపింది. భారత్‌లో గాల్వనైజ్డ్ స్టీల్ మార్కెట్ 2025లో సుమారు 76.5 లక్షల టన్నులుగా ఉందని, 2030 వరకు ఏటా 8 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పెలికాన్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. ఏకరీతి పూత నాణ్యత, అధిక తుప్పు నిరోధకత, మెరుగైన రూపం, తయారీ సౌలభ్యం దీని ప్రత్యేకతలని వివరించింది. పైకప్పు నిర్మాణ భాగాలు, గొట్టాలు, ఎయిర్ కండిషనింగ్, వెంటిలేషన్ వ్యవస్థలు, కేబుల్ ట్రేలు, కంచెలు, ఫర్నిచర్, డ్రమ్‌లు, బారెల్స్, ఇతర ఇంజనీరింగ్ అవసరాల్లో దీనిని వినియోగించవచ్చని తెలిపింది. ఏఎం/ఎన్ఎస్ ఇండియా సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ రంజన్ ధర్ మాట్లాడుతూ.. వినియోగదారుల నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారిత ఉక్కు పరిష్కారాలకు డిమాండ్ పెరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా సంస్థ పంపిణీ వ్యవస్థ ద్వారా పెలికాన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

తాలీమ్-ఎ-హునర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏపీ వక్ఫ్ బోర్డుకు స్థానం
- అధికారికంగా రికార్డు హోల్డర్‌గా నమోదు
- విద్యా రంగంలో విస్మృత్న కార్యక్రమానికి అరుదైన గౌరవం
- ?వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, మహానగర్

పేద, ప్రతిభావంతులైన ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన ఉచిత వసతి విద్య అందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చేపట్టిన ప్రతిష్టాత్మక తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమాన్ని గుర్తిస్తూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును అధికారికంగా రికార్డు హోల్డర్‌గా ప్రకటించింది. 'మోస్ట్ మెరిటోరియస్ స్టూడెంట్స్ గాట్ ఫ్రీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్' విభాగంలో బోర్డు పేరును అధికారిక రికార్డుల్లో నమోదు చేసినట్లు వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల కలలు ఆగిపోకూడదనే లక్ష్యంతో తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమాన్ని ప్రారంభించామని, దీనికి అంతర్జాతీయ గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. ఈ విజయం వక్ఫ్ బోర్డుదే కాకుండా కార్యక్రమం ద్వారా భవిష్యత్తును నిర్మించుకుంటున్న ప్రతి విద్యార్థిదని పేర్కొన్నారు. ఈ గుర్తింపు తమపై మరింత బాధ్యత పెంచిందని, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరిన్ని విస్మృత్న కార్యక్రమాలు చేపట్టి పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేశ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ప్రోత్సాహంతో విద్యా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఈ గుర్తింపు సాధనలో కృషి చేసిన వక్ఫ్ బోర్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు అబ్దుల్ అజీజ్ అభినందనలు తెలిపారు.

జరగబోయేది కురుక్షేత్ర సంగ్రామం

-మొదటిపేజీ తరువాయి

వాయిదా వేయాలన్న ఉద్దేశం ఉందని వ్యాఖ్యానించారు.
ఆ రిజర్వేషన్లను కోర్టు కొట్టివేస్తుందని ప్రభుత్వానికి ముందే తెలుసని, దానిని సాకుగా చూపి ఎన్నికలను వాయిదా వేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "రేపు జరిగేది కురుక్షేత్ర సంగ్రామం. స్థానిక ఎన్నికల్లో జరిగే అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగంపై కసి వచ్చే సాధారణ ఎన్నికల్లో కనిపించాలి" అని అన్నారు.

ఓట్లపై కూడా అనుమానాలు..

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపైనా జగన్ ప్రశ్నలు సంధించారు. ఇప్పటికే 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిజంగా సజావుగా జరుగుతాయా? అని ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ ప్రజలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. "ఎన్నికలు సాఫీగా జరిగితే వైఎస్సార్‌సీపీదే విజయం. సాఫీగా జరగనివ్వకపోయినా గట్టిగా పోరాడదాం. స్థానిక ఎన్నికల్లో మీరు గట్టిగా నిలబడాలి" అని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రోజుకో డ్రామా.. డైవర్షన్ పాలిటిక్స్

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం ఎన్నికలు సాఫీగా సాగే అవకాశం లేదని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, జైలుకు పంపడం జరుగుతోందని ఆరోపించారు. "రోజుకో డ్రామా.. రోజుకో నటన.. డైవర్షన్ పాలిటిక్స్" అంటూ కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.
స్థానిక ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించినవి కావని, అవి ప్రధానంగా కార్యకర్తల ఎన్నికలని జగన్ అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు కార్యకర్తలే అండగా ఉంటారని, అలాంటి కార్యకర్తలకు పార్టీ కూడా అండగా నిలవాలని సూచించారు. దౌర్జన్యంతో ఎప్పటికీ పాలకులు రాజ్యం చేయలేరని వ్యాఖ్యానించారు. 2019 హిస్టరీ రిపీట్ చేద్దాం.. జరగబోయేది కురుక్షేత్ర సంగ్రామం

నంద్యాల ఉప ఎన్నికను గుర్తుచేస్తూ..

పర్చూర్ కేడర్ వద్ద తన గత రాజకీయ అనుభవాలను కూడా వైఎస్ జగన్ ప్రస్తావించారు. 2017లో తాను పాదయాత్ర ప్రారంభించడానికి ముందు నంద్యాల ఉప ఎన్నిక జరిగిందని గుర్తుచేశారు. తీవ్ర అధికార దుర్వినియోగం కారణంగా వైఎస్సార్‌సీపీ 35 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిందని అన్నారు. 2014--19 మధ్య తమ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను చంద్రబాబు తీసుకున్నారని జగన్ ఆరోపించారు. ఆ తర్వాత తాను పాదయాత్ర చేపట్టానని, ప్రజల్లో పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని తెలిపారు. 2019 ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. నాడు తమ పార్టీ నుంచి తీసుకెళ్లిన 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీల సంఖ్యకే చంద్రబాబు పార్టీ పరిమితమైందని వ్యాఖ్యానించారు.

మంచి చేసి ఓటు అడగాలి..

పాలకులు ప్రజలకు మంచి చేసి, ఆ పనులను చూపించి ఓట్లు అడగాలని జగన్ అన్నారు. అలా చేసినప్పుడే దేవుడి ఆశీస్సులు, ప్రజల ఆదరణ లభిస్తాయని పేర్కొన్నారు. ఎల్లవేళలా అబద్ధాలు, దౌర్జన్యాలను ప్రజలు హర్షించబోరని అన్నారు. "జరగబోయేది కురుక్షేత్ర సంగ్రామం. ఆ సంగ్రామంలో మీరంతా ప్రజలకు తోడుగా నిలబడాలి.. పోరాడాలి" అని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రవాణా సౌకర్యాలేంటి?

-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి రవాణా సౌకర్యాలు కల్పించారు, ఏయే సమయాల్లో బస్సులు తిప్పుతున్నారు, ఎన్ని విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి, ఆయా సమయాలకు తగ్గట్టు రవాణా సౌకర్యం ఉందా తదితర వివరాలను తమ ముందు ఉంచాలని ఆదేశించింది.

విచారణ వాయిదా వేసిన కోర్టు

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సివిల్, వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేస్తూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ ఈ ఏడాది జులై 28న జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావు, మరో ఇద్దరు హైకోర్టులో పిల్ వేశారు.

ప్రయాణికుల ఇబ్బందులు

వారి తరఫున న్యాయవాది వి.లక్ష్మీహరీశ్ వాదనలు వినిపిస్తూ భోగాపురం విమానాశ్రయం చేరుకోవడానికి పెద్ద సమస్యగా ఉందన్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది అన్నారు. బస్సుల సౌకర్యం లేదన్నారు. ఒకసారిగా విశాఖ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం భోగాపురం విమానాశ్రయానికి ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలేమిటో చెప్పాలని ఏజీని ప్రశ్నించింది.

ప్రభుత్వ వివరణకు కోర్టు సూటి ప్రశ్న

రాష్ట్రప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ సాధారణ రవాణా బస్సుల సౌకర్యంతో పాటు అదనంగా 20 ఎలక్ట్రికల్ బస్సులు ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నడుస్తున్నాయన్నారు. కార్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ రాత్రి ఏడు గంటల తర్వాత విమానాలు రాకపోకలు సాగించడం లేదా అని ప్రశ్నించింది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బస్సులు సరిపోవేమోనని అభిప్రాయపడింది. విమానాల రాకపోకల సమయం, ఆ సమయాల్లో కల్పించిన రవాణా సౌకర్యాలేమిటో కోర్టుకు తెలియజేయాలంటూ విచారణను వాయిదా వేసింది.


జనసైనికుల్లో నెలకొన్న నైరాశ్యం

కాకినాడ

జనసేనలో స్తబ్ధత నెలకొంది. ఇటు నేతల్లోనూ అటు కార్యకర్తల్లోనూ ఈ నైరాశ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం పెద్దగా లేదు. అక్టోబరు చివరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నైరాశ్యం జనసేనను ఎటు వైపు తీసుకెళుతుందన్న చర్చ ఇటు పార్టీలోనూ, అటు కూటమిలోనూ జరుగుతోంది. పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకు వచ్చిన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. పవన్ ప్రచారానికి రాకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్న భావన జనసైనికుల్లోనూ, కూటమిలోని మిగిలిన పార్టీల్లోనూ వ్యక్తమవుతుంది. ఈ కారణం వల్లనే జనసైనికుల్లోనూ, నేతల్లోనూ కొంత స్తబ్ధత నెలకొందని చెప్పాలి. జనసేన పార్టీలో ఎప్పుడైనా నైరాశ్యం లేదా స్తబ్ధత నెలకొన్నప్పుడు, ఆ నైరాశ్యాన్ని పారదోలి పార్టీని ముందుకు నడిపేది ముమ్మాటికీ ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజం. 2019 ఎన్నికల ఓటమి తర్వాత లేదా కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తలలో అక్కడక్కడా గందరగోళం, నైరాశ్యం ఏర్పడిన ప్రతిసారీ పవన్ కళ్యాణ్ తన స్ఫూర్తిదాయక ప్రసంగాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. పార్టీలో నైరాశ్యాన్ని పారదోలేందుకు, క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకు కేవలం పవన్ కల్యాణ్ మాత్రమే కారణమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయ కమిటీలను నియమించి దిశానిర్దేశం చేయడం ద్వారా శ్రేణులకు ఆయన భరోసా ఇస్తున్నారు.2024 ఎన్నికల్లో సాధించిన 100% విజయంతో ప్రస్తుతం జనసేన ఏపీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. డిప్యూటీ సీఎంగా

బాబా నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీకి జాతీయ పురస్కారం

అమరావతి, మహానగర్



ఆధ్యాత్మికత, మానవతా సేవ, శాంతి, సద్భావన, సోదరభావం, మానవ విలువల పరిరక్షణకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వ్యక్తి సూఫీ బాబా నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీకి ప్రతిష్ఠాత్మక "జాతీయ సద్భావన ఉత్కృష్టత పురస్కార్" లభించింది. హజ్రత్ బాబా తాజుద్దీన్ అవులియా, నాగ్‌పూర్ పవిత్ర ఆశీస్సులతో పుణేలోని జ్ఞాన మందిర్ నివాస్‌లో నిర్వహించిన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమంలో వీఐ వరల్డ్ పీస్ యూనివర్సిటీ, పుణే వ్యవస్థాపకులు రాజయోగి డా. విశ్వనాథ్ డి. కరాడ్ చేతుల మీదుగా బాబా నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీ పురస్కారాన్ని అందుకున్నారు. జంపాని, తెనాలి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆయన ఆధ్యాత్మిక సేవలతో పాటు మానవతా విలువలు, సోదరభావం, సామాజిక సద్భావన, శాంతి, నిస్వార్థ సేవ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డా. విశ్వనాథ్ డి. కరాడ్ తన చేతుల మీదుగా ఈశీబ మీఐ దీవశ్రీఱవజవ శీతీ మీఐ చీశీ" పుస్తకాన్ని కూడా బాబా నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీకి అందజేశారు. కార్యక్రమంలో అహిల్యానగర్ జిల్లా, పర్లేర్, పింప్రి--జలసేన్, మహారాష్ట్రకు చెందిన ప్రముఖ సూఫీ సంత్ డా. షాబుద్దీన్ నూర్ మహమ్మద్ పఠాన్ పాల్గొని ఆధ్యాత్మిక ఆశీస్సులు అందించారు. ముంబైకి చెందిన కే. గంగాధర్, దినేష్ పాటిల్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నాగ్‌పూర్‌కు చెందిన డా. అనిల్ వాఘ్మును కూడా "జాతీయ సద్భావన ఉత్కృష్టత పురస్కార్"తో ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మికత, శాస్త్రీయ ఆలోచన, మానవతా విలువలు, శాంతి, సద్భావనలను సమన్వయం చేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం విశిష్ట వేదికగా నిలిచిందని, సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం, నిస్వార్థ సేవా భావాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత స్ఫూర్తినిస్తాయని పాల్గొన్న వారు పేర్కొన్నారు.

మొక్కలు నాటి.. పర్యావరణాన్ని కాపాడాలి



గన్నవరం, మహానగర్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ శివప్రసాద్ పిలుపునిచ్చారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా బుధవారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని, కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. సునీల, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్, ఉపాధ్యాయులు నాగేంద్రరావు, రాము, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తి పరవశంలో శ్రీరామ నామ పారాయణం



హనుమాన్ జంక్షన్, మహానగర్

రంగయ్య అప్పారావుపేటలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో నిర్వహించిన 'శ్రీరామ జయరామ జయజయ రామ' ఏకనామ పారాయణ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా ముగిసింది. మహోత్సవ ముగింపు సందర్భంగా ఉదయం గణపతి పూజ, కలశ స్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ కోదండ రామస్వామివారికి పంచామృతాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అభిషేకానంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి, భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పుష్పార్చన, శ్రీరామ అష్టోత్తర సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ విష్ణు పాండ్య వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయారు. స్వామివారి విశేష అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలంకార వైభవాన్ని దర్శించిన పలువురు ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు ప్రశంసలు కురిపించారు. శ్రీరంగం తర్వాత ఇంత అద్భుతమైన శ్రీ కోదండ రామస్వామి అలంకార వైభవాన్ని రంగయ్య అప్పారావుపేటలోనే దర్శించామని పలువురు అభిప్రాయపడ్డారు.

పేద విద్యార్థినుల మధ్య జలీల్ అహ్మద్ జన్మదిన వేడుకలు



కోట, మహానగర్

టీడీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు, టీడీపీ నేత షేక్ జలీల్ అహ్మద్ జన్మదిన వేడుకలను జనసేన నాయకుడు చంద్రగిరి మధు సేవా కార్యక్రమంగా నిర్వహించారు. కోటలోని బాలసదనం బాలికల వసతి గృహంలో బుధవారం మధు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జలీల్ అహ్మద్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థినులకు పంచిపెట్టారు. బాలసదనంలోని 50 మంది విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జలీల్ అహ్మద్ మాట్లాడుతూ పేద విద్యార్థినుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, మద్దాలి సర్వోత్తమ రెడ్డి, మధు యాదవ్, నెల్లూరు మోహన్ రెడ్డి, పలగాటి భాస్కర్ రెడ్డి, మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి, తిరుమల శెట్టి కోటి, పిట్ల అనిల్, పుచ్చలపల్లి పవన్, మల్లీ శరత్, బాలసదనం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైజ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

- స్కిల్ మంథన్ వేదికపై 'రైజ్' కీర్తి పతాక.. సమష్టి కృషికి దక్కిన ఫలితం
- గ్రామీణ మహిళా సాధికారతలో వినూత్న చొరవకు గుర్తింపు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్



గ్రామీణ మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పిస్తూ, నైపుణ్యాలను అభివృద్ధి చేసి స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల వైపు ప్రోత్సహించేందుకు జిల్లాలో అమలు చేస్తున్న రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ (రైజ్) కార్యక్రమానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్కిల్ మంథన్' వెబినార్‌లో దేశంలోని మహిళల జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధికి అమలవుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రదర్శించగా, జిల్లాకు చెందిన రైజ్ కార్యక్రమాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. నగరంలోని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెబినార్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైజ్‌కు లభించిన గుర్తింపు జిల్లా యంత్రాంగం, స్వయం సహాయక సంఘాల మహిళలు, భాగస్వామ్య సంస్థల సమష్టి కృషికి దక్కిన ఫలితమన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' ఆలోచనతో గుంటుపల్లిలోని రైజ్ కేంద్రం మహిళలను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది వారి సామర్థ్యాలను ఆదాయ వనరులుగా మలిచే దిశగా పనిచేస్తోందన్నారు. నీతి ఆయోగ్, సెర్ప్ తదితర శాఖల సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, రైజ్‌ను మరింత విస్తరించి ఎన్‌టీఆర్ జిల్లాను మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధిలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- నీటి సంరక్షణ, స్వచ్ఛత, హరిత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- రైతులకు ఎరువుల కొరత లేకుండా పటిష్ట పర్యవేక్షణ
- ప్రజా భద్రతపై రాజీ లేదు.. విస్తృతంగా భద్రతా తనిఖీలు నిర్వహించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టమైన ఆదేశాలు



విజయవాడ, మహానగర్

ముఖ్యమంత్రి కార్యాలయం, పీజీఆర్ఎస్.. ఇలా వివిధ మార్గాల ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన విచారణ చేపట్టి తప్పనిసరిగా నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరం నుంచి కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ.. జిల్లా స్థాయి అధికారులతో నేరుగా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్ గా బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలధార--జలహారతి 2.0 కింద పనులకు అవసరమైన అనుమతులను వేగంగా పొందడంతో పాటు పనులను పటిష్టంగా పర్యవేక్షించాలని సూచించారు. నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల పరిస్థితిని పర్యవేక్షించాలని, వాన నీటి సంరక్షణ, రీఛార్జ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది స్వయంగా పాల్గొని పరిశుభ్రత, ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నెట్ జీరోలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో సోలార్ ప్యానెళ్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లాంటేషన్ పనులను వేగవంతం చేసి, వేప, టేకు వంటి నాణ్యమైన మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో సెకండ్ డోస్ ప్రారంభమైనందున ఆర్డీవోలు, సంబంధిత అధికారులు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల్లోని స్టాక్‌ను ప్రతి వారం తనిఖీ చేయాలని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఎరువుల దుకాణాల వద్ద ధరలు, ఫిర్యాదుల కోసం కలెక్టర్ కార్యాలయ కాల్ సెంటర్ వివరాలతో ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పెట్రోల్ బంకులు, బహుళ అంతస్తుల భవనాలు, థియేటర్లు, కెమికల్ పరిశ్రమలు, షాపింగ్ ఏరియాలు తదితరాల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. 'వన్ ఫ్యామిలీ--వన్ ఆంత్రప్రెన్యూర్' సర్వే డేటాను మండలాలు, పట్టణ ప్రాంతాల్లో వేగంగా అప్‌డేట్ చేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. కాలుష్య నియంత్రణ మండలి, ఇతర సమన్వయ శాఖల అధికారులతో కలిసి మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శిగా హనుమంతరావు

ఆగిరిపల్లి, మహానగర్



మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండ్ల హనుమంతరావును వైసీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శిగా నియమించారు. వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఈ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, ఇతరులు హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటర్ల క్లెయిమ్స్, అభ్యంతరాలకు నేటితో ముగియనున్న గడువు



గన్నవరం, మహానగర్

ఓటర్ల జాబితాకు సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలుకు ఈ నెల 10వ తేదీతో గడువు ముగియనుందని గన్నవరం తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి కె.వి. శివయ్య తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఓటర్ల జాబితా, తుది జాబితా ప్రచురణ, తప్పులు, 'నో మ్యాపింగ్' కేసులు, ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులపై చర్చించారు. సెప్టెంబరు 9 నాటికి నియోజకవర్గంలో 2,55,119 మంది ఓటర్లు ఉన్నారని శివయ్య తెలిపారు. అక్టోబరు 9న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉంటే సెప్టెంబరు 10లోపు దాఖలు చేయాలని సూచించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో 40,086 'నో మ్యాపింగ్' కేసులు గుర్తించగా, ఇప్పటివరకు 37,605 కేసులను విచారించి పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో 480 మంది ఓటర్లను అనర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఫారం-8కు సంబంధించి 4,701, ఫారం-7కు 391, ఫారం-6కు 2,504 చొప్పున మొత్తం 7,596 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని అక్టోబరు 5లోపు పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు పెండింగ్‌లో ఉన్న 2,481 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. తుది ఓటర్ల జాబితాను కలర్ ఫొటోలతో పారదర్శకంగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ తరపున ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ తరపున ముప్పానేని రవికుమార్, బీజేపీ తరపున టి. మురళీధర్, జనసేన పార్టీ తరపున చిమట రవివర్మ, సీపీఐ తరపున కె. రామచంద్ర జోషి, విజయవాడ రూరల్ ఎంపీడీవో సారథి తదితరులు పాల్గొన్నారు.

మహానగర్

వ్యవసాయానికి డేంజర్ బెల్స్

దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జూలైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి.వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. చెరువులు నిండకపోతే భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క, ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశంలో పడని వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీర్చాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది. నీటి లెక్కను కేవలం ప్రాజెక్టుల దగ్గర ఆపకూడదు. ఆకాశం నుంచి మొదలుపెట్టి రైతు పొలం వరకు చూడాలి. ఎంత వర్షం పడాలి. ఎంత పడింది. గత ఐదేళ్లలో ఎంత పడింది. పదేళ్ల సగటుతో పోలిస్తే పరిస్థితి ఎలా ఉంది. ఏ జిల్లాల్లో వర్షం తగ్గింది. ఏ మండలాల్లో లోటు ఎక్కువగా ఉంది. ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఎన్ని చెరువులు నిండాయి. ఎన్ని ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కలిపితేనే వర్షం ప్రభావం ఎంత పెద్దదో అర్థమవుతుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోను వర్షం ముఖం చాటేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో సాధారణంగా 452.9 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ ఇప్పటివరకు 203.9 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే ఏకంగా 55 శాతం వర్ష లోటు. 28 జిల్లాల్లోనూ లోటు పరిస్థితే ఉంది. అన్నమయ్య జిల్లాలో 77.5 శాతం, ప్రకాశంలో 71.4 శాతం, విశాఖలో 60.4 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార వ్యవసాయంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలపైనా ప్రభావం పడుతోంది.ఇప్పుడు నీటిని కేవలం ప్రాజెక్టుల సమస్యగా చూడలేం. వర్షపు నీటిని ఎంత వరకు ఒడిసిపట్టుకుంటున్నాం. చెరువులను ఎంత వరకు కాపాడుతున్నాం. భూగర్భ జలాలను ఎలా పెంచుతున్నాం. పట్టణాల్లో వర్షపు నీరు ఎంత వృథా అవుతోంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఎలా ఉందో ఆలోచించాలి. ఒక గ్రామాన్ని తీసుకుంటే ఈ సమస్య మొత్తం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ గ్రామంలో సాధారణంగా ఎంత వర్షం పడుతుంది. ఈసారి ఎంత పడింది. చెరువులోకి ఎంత నీరు వచ్చింది. బోర్లలో నీటి మట్టం ఎంత తగ్గింది. ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. ఎన్ని ఎండిపోయాయి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని ఎకరాలకు నీరు అందింది. ఎంత పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే రైతుకు ఎంత నష్టం వచ్చింది. చివరికి ఎంత అప్పు మిగిలింది. ఈ లెక్కను ఒక గ్రామం నుంచి చూపిస్తే తెలంగాణ మొత్తం నీటి కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.తెలంగాణలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 132.4 లక్షల ఎకరాలు. ఈసారి సెప్టెంబర్ 2 నాటికి 119.6 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. అంటే సాధారణ సాగులో దాదాపు 90 శాతం పూర్తయింది. గతేడాది ఇదే సమయానికి 123.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఏపీలోనైతే సాధారణ విస్తీర్ణం 76.2 లక్షల ఎకరాలు. ఈసారి వేసింది 57.8 లక్షల ఎకరాలు. గతంలో పోల్చుకుంటే 18.4 లక్షల ఎకరాలు తగ్గింది. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 24.1 శాతం తక్కువగా ఉంది.దేశవ్యాప్తంగా ఈసారి ఖరీఫ్‌లో సెప్టెంబర్ 4 నాటికి 1,086 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. అంటే సుమారు 268.5 మిలియన్ ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే దేశంలో సాగు విస్తీర్ణం 1.6 శాతం తక్కువగా ఉంది.మబ్బులో నుంచి వచ్చిన నీటిలో ఎంత మన దగ్గర నిలిచింది. చెరువుల్లో ఎంత చేరింది. భూగర్భంలోకి ఎంత వెళ్లింది. ప్రాజెక్టుల్లో ఎంత నిల్వ ఉంది. కాలువల్లోకి ఎంత విడుదలైంది. రైతు పొలానికి ఎంత చేరింది. ఆ నీటితో ఎంత పంట పండింది. ఆ పంటతో రైతు చేతిలో చివరికి ఎంత మిగిలింది. ఈ మొత్తం లెక్కే తెలంగాణ నీటి అసలు లెక్క.ఆకాశం వాన ఇవ్వాలి. చెరువు నీటిని దాచుకోవాలి. ప్రాజెక్టు నీటిని పొలానికి చేర్చాలి. రైతు పంట పండించాలి. పంటకు మంచి ధర రావాలి. అప్పు తీరాలి. అప్పుడే నీటి లెక్క రైతు జీవితంలో మంచి ఫలితంగా మారుతుంది. వాన కోసం ఆకాశం వైపు చూసే రైతు కళ్లలో నీరు కాదు. నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది కేవలం వర్షం కాదు. మన నీటి నిర్వహణ అనేది నిజం. ఆ దిశగా పాలకులు ఆలోచిస్తే అన్నదాత ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

ఇస్రో పై 'వేటు'?



నరేంద్రమోదీ నేతృత్వంలో 12 ఏండ్ల క్రితం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడు తుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయి. జరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. నాయకత్వం మాత్రం ప్రభుత్వ సంస్థ చేతుల్లోనే ఉండాలి. లేకపోతే ప్రపంచం విస్తుపోయే అభివృద్ధిని సాధించిన ఇస్రో, రేపు కార్పొరేట్ లాభాల వేటలో తన అసలైన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉన్నది.

చట్టసభల దగ్గరే ప్రజాస్వామ్యానికి తూట్లు



తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలి రోజే జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపెట్టేవిగా ఉన్నాయి. సభలో ప్రతిపక్షం -- అధికారపక్షం మధ్య రాజకీయ ఘర్షణలు జరుగడం కొత్త కాదు. కానీ శాసనసభ్యులు సభలోకి ప్రవేశించకముందే పోలీసుల ద్వారా అడ్డుకోవడం, నిరసన వ్యక్తం చేయడానికి వారు ఎంచుకున్న దుస్తులను కూడా ఒక సమస్యగా పరిగణించడం దారుణం. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకు కళంకం తీసుకొచ్చేవిగా ఉన్నాయి. ప్రతిపక్ష సభ్యులు నల్ల దుస్తులు ధరించడం ఒక నిరసన రూపం. అది సభా కార్యకలాపాలను అడ్డుకోవడం కంటే ముందే నేరంగా మారిపోదు. దుస్తులపై ఏవైనా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఉంటే వాటిని తీసేసి రమ్మని చెప్పవచ్చు. నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో అధికారపక్షానికే కాదు, ప్రతిపక్షానికీ ఉంటుంది. ఆ నిరసన సభా నియమాలను ఉల్లంఘిస్తే సభాపతి చర్య తీసుకోవచ్చు. కానీ సభా ప్రాంగణంలోకి అడుగుపెట్టకముందే పోలీసుల ద్వారా సభ్యులను అడ్డుకోవడం మాత్రం అత్యంత తీవ్రమైన పరిణామం. శాసనసభ్యులను పోలీసులు తోసేయడం, లాగడం, అడ్డుకోవడం ప్రజాస్వామ్య సంస్థల గౌరవానికి విరుద్ధం. మహిళా శాసనసభ్యుల విషయంలో పోలీసుల ప్రవర్తన మరింత ఆందోళన కలిగించే విషయం. మహిళా సభ్యులను పురుష పోలీసులు అడ్డుకున్నారనే ఆరోపణలు నిజమైతే, అది కేవలం పోలీసింగ్ పద్ధతిపై మాత్రమే ప్రశ్న కాదు, మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం, భద్రత, హక్కులపై ప్రశ్న. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలువాల్సిన శాసనసభ గుమ్మం దగ్గరే ఇటువంటి దృశ్యాలు కనిపించడం మంచి సంకేతం కాదు. దేశ రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘర్షణలు ఎన్నో హెచ్చరికలు ఇచ్చాయి. తమిళనాడు శాసనసభలో జయలలితకు ఎదురైన అవమానకర ఘటనలు ఇప్పటికీ రాజకీయ చరిత్రలో మిగిలిపోయాయి. సభలో రాజకీయ ప్రత్యర్థిత్వం హద్దులు దాటితే అది వ్యక్తుల మధ్య ఘర్షణగా మొదలై, చివరకు సంస్థల ప్రతిష్టను దెబ్బతీస్తుంది. తెలంగాణ ఆ దారిలో నడువకూడదు. ఇదే సమయంలో ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యల వివాదాన్ని కూడా రాజకీయ వివేకంతో చూడాల్సిన అవసరం ఉన్నది.

తాను చేసిన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి కాదని ఆయన స్పష్టంచేశారు. ఒకవేళ స్పీకర్‌కు అలా అనిపించినట్టయితే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటానని, తన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానని కూడా ప్రకటించారు. ఒక ప్రజాప్రతినిధి తన వ్యాఖ్యపై విచారం వ్యక్తం చేసిన తర్వాత కూడా అదే అంశాన్ని సభ మొత్తాన్ని స్తంభింపజేసే స్థాయికి తీసుకెళ్లడం అవసరమా అనేది ఆలోచించాల్సిన ప్రశ్న.

స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనది. ఆ పదవిని అవమానించేలా ఎవరు మాట్లాడినా ఖండించాల్సిందే. అదే సమయంలో స్పీకర్ కూడా సభను అన్ని పక్షాలకు సమానంగా అందుబాటులో ఉంచే రాజ్యాంగబద్ధమైన పాత్రను పోషించాలి. ఒక సభ్యుడి వ్యాఖ్యను మొత్తం ప్రతిపక్షానికి, ఒక పార్టీకి, లేదా ఒక సామాజిక వర్గానికి అంటగట్టడం కూడా సరైన ప్రజాస్వామ్య పద్ధతి కాదు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉన్నది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య తీవ్రంగా ఉన్నది. ఉద్యోగులు పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కోసం చూస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై ముందస్తు ప్రణాళిక అవసరమని నిపుణులు సూచనలు చేస్తున్నారు. ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చి, వాటి పరిష్కారంలో పారదర్శకత లేకపోవడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి సమస్యలపై సభలో సమగ్ర చర్చ జరుగాల్సిన సమయంలో సభ ఈ విధమైన గందరగోళమైన పరిస్థితిలో నడువడం, సభా సమయాన్ని వృథా చేయడం ప్రజల పట్ల అన్యాయం. ఇక్కడ కాంగ్రెస్‌కు ఒక విషయం గుర్తుండాలి. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పార్లమెంటును నిర్వహించకుండా ఆటంకాలు కలిగిస్తున్నదని కాంగ్రెస్ విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. ప్రధాని, హోంమంత్రి సభకు రావాలని డిమాండ్ చేస్తూ సభను స్తంభింపజేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరి అదే రాజకీయ సంస్కృతి రాష్ట్ర శాసనసభలో అధికారపక్షంగా ఉన్నప్పుడు ఎందుకు మారాలి? ప్రజాస్వామ్యం అంటే అధికారపక్షం మాట్లాడటం కాదు. ప్రతిపక్షం మాట్లాడటం కూడా కాదు. అధికారపక్షం మాట్లాడినంత సమయం ప్రతిపక్షానికి కూడా మాట్లాడే అవకాశం ఉండటం. ప్రతిపక్షం నిరసన తెలిపినంత మాత్రాన దాన్ని అణచివేయకుండా, సభా నియమాల పరిధిలో ఎదుర్కోవడం, సభా సమయాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం. పోలీసులు ప్రభుత్వానికి రాజకీయ రక్షక దళం కాదు. వారు చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ. ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రభుత్వ శత్రువులు కాదు. వారు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు. ఈ రెండు వాస్తవాలను ప్రభుత్వం మరచిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. సోమవారం జరిగిన ఘటనను కేవలం కాంగ్రెస్‌బీఆర్ఎస్ రాజకీయ గొడవగా కొట్టిపారేయడం సరిపోదు. ఇది తెలంగాణ శాసనసభ ప్రతిష్టకు సంబంధించిన విషయం. సభ గుమ్మం దగ్గరే ప్రజాప్రతినిధులను అడ్డుకొనే పరిస్థితి ఏర్పడితే, రేపు ఏ ప్రభుత్వం వచ్చినా అదే పద్ధతిని అనుసరించే ప్రమాదం ఉంటుంది కదా! ఒకసారి అధికారానికి ఈ మార్గం అలవాటైతే, ప్రతిపక్షంలోకి వెళ్లినప్పుడు అదే అధికారాన్ని విమర్శించే నైతిక హక్కు రాజకీయ పార్టీలకు బలహీనమవుతుంది.

జరిగినది ఎవరి విజయమూ కాదు. అధికారపక్షానిది కాదు, ప్రతిపక్షానిదీ కాదు. అది ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టం. శాసనసభ గుమ్మం ప్రజాప్రతినిధులకు మూసుకుపోయే రోజు ప్రజల గొంతుకకు కూడా తలుపులు మూసుకుపోయిన రోజు. తెలంగాణ రాజకీయ వ్యవస్థ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకూడదు. అధికారపక్షం ప్రతిపక్షాన్ని గౌరవించాలి. ప్రతిపక్షం సభా నియమాలను గౌరవించాలి. స్పీకర్ అన్ని పక్షాలకు న్యాయమైన వేదిక కల్పించాలి. పోలీసులు రాజకీయ ఆదేశాల కంటే రాజ్యాంగబద్ధమైన బాధ్యతకు కట్టుబడి ఉండాలి. లేకపోతే శాసనసభ ప్రజాస్వామ్య చర్చల నిలయం కాకుండా, అధికార -- ప్రతిపక్ష యుద్ధరంగంగా మిగిలిపోతుంది. ప్రజలు మాత్రం బయట నిలబడి తమ సమస్యలకు సమాధానం కోసం ఎదురు చూస్తూనే ఉంటారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ భారీగా విరాళాలు వచ్చాయి. కాంగ్రెస్?తో పోలిస్తే భారీగానే వ్యత్యాసం కనిపించింది. బీజేపీ కేంద్ర కార్యాలయానికి మాత్రమే దాదాపు రూ.1,473 కోట్లు నిధులు వచ్చాయి. కానీ కాంగ్రెస్?కు మాత్రం కేంద్ర, రాష్ట్ర విభాగాలన్నింటినీ కలిపి వచ్చిన ఆదాయం రూ.207 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే బీజేపీకి వచ్చిన మొత్తం నిధులు కాంగ్రెస్ కంటే ఏడు రేట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇరు పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల్లో ఈ వివరాలు వెల్లడించారు.

బీజేపీ ఖాతాలో రూ.1,472.8 కోట్లు

ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మార్చి 15 నుంచి మే 6 వరకు బీజేపీ కేంద్ర కార్యాలయానికి రూ.1472.8 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఈసీకి సమర్పించిన వివరాల్లో వెల్లడైంది. అయితే కేరళ, బంగాల్ ఎన్నికలకు సంబంధించిన బీజేపీ ఖర్చుల నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. ఆయా రాష్ట్రాల వివారలు కూడా కలిపితే పార్టీ మొత్తం ఆదాయం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ప్రారంభంలో మార్చి 15న బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాల్లో సుమారు రూ.6,722.6 కోట్లు ఉన్నాయి. మే 6 నాటికి ఆ మొత్తం రూ.7,627.2 కోట్లకు చేరింది. అంటే ఎన్నికల వ్యవధిలోనే కేంద్ర కార్యాలయ నిధుల్లో రూ.904.6 కోట్ల పెరుగుదల నమోదైంది.

కాంగ్రెస్ నిధుల్లో తగ్గుదల

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మాత్రం ఎన్నికల సమయంలో ఆర్థిక పరిస్థితి భిన్నంగా కనిపించింది. ఐదు రాష్ట్రాల పార్టీ విభాగాలు, కేంద్ర కార్యాలయాన్ని కలిపి ఎన్నికల ప్రారంభంలో సుమారు రూ.169.06 కోట్లు ఉన్నాయి. ఇందులో రూ.22.9 కోట్లు నగదు రూపంలో, రూ.146.1 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్నాయి. ఎన్నికలు ముగిసే సమయానికి ఈ మొత్తం సుమారు రూ.103.2 కోట్లకు తగ్గింది. అంటే ఎన్నికల కాలంలో కాంగ్రెస్ నిధుల్లో దాదాపు రూ.65.86 కోట్ల క్షీణత నమోదైంది.



బీజేపీ ఖర్చు ఎక్కడెంత?

ఇప్పటివరకు బహిర్గతమైన బీజేపీ వ్యయ వివరాల ప్రకారం, అసోం, తమిళనాడు, పుదుచ్చేరిల్లో సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, మిగిలిన మొత్తం అభ్యర్థులు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించింది. అసోంలో బీజేపీ అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.76.73 కోట్లు పార్టీ సాధారణ ప్రచారానికి, రూ.19.54 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చయ్యాయి. సాధారణ ప్రచార వ్యయంలో ప్రకటనలకు దాదాపు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.27.3 కోట్లు ఖర్చయ్యాయి. ఇక తమిళనాడులో బీజేపీ రూ.51.56 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.44.51 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.7.05 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించింది. మీడియా ప్రకటనలకు సుమారు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.10.04 కోట్లు ఖర్చు చేసింది. ప్రచార సామగ్రికి మరో రూ.5.85 కోట్ల వరకు వెచ్చించింది. పుదుచ్చేరిలో బీజేపీ మొత్తం రూ.11.90 కోట్ల ఎన్నికల వ్యయాన్ని చూపించింది. ఇందులో రూ.9.19 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.2.71 కోట్లు అభ్యర్థులకు సంబంధించిన ఖర్చులకు వెళ్లాయి.

కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు రూ.248.55 కోట్లు

ఇక కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో కలిపి రూ.248.55 కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేసింది. ఇందులో రూ.143 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, రూ.105.55 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చు చేసింది. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారానికి రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా, రాష్ట్ర, స్థానిక విభాగాలు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి. ఈ వ్యయంలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ సాధారణ ప్రచారానికి రూ.59.28 కోట్లు ఖర్చు చేసింది. అసోంలో రూ.22.62 కోట్ల వ్యయం నమోదైంది.

భారత్, రష్యా రక్షణ ఒప్పందం

భారత్- రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. దిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్. ఈ రక్షణ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఆసియా ఖండంలో భారత్ రక్షణ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.

ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ

మిలిటరీ-టెక్నికల్ సహకారమే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగనున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి ప్రధాన అంశం. ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ. శత్రు దేశాల నుంచి దూసుకొచ్చే విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిస్సైళ్లను గాలిలోనే పసిగట్టి నిర్వీర్యం చేయగల శక్తివంతమైన వ్యవస్థ ఇది. 2018లో రష్యాతో భారత్ 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు వ్యవస్థలను కొనుగోలు చేయగా, ఇప్పటికే మూడు భారత్‌కు చేరాయి. భారత వాయు రక్షణలో కీలకమైన ఈ ఎస్-400 సిస్టమ్స్ తదుపరి రెండు యూనిట్లను 2026 నాటికి పూర్తి స్థాయిలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని రష్యా తాజాగా ప్రకటించింది. రక్షణ కొనుగోళ్ల మండలి కూడా అదనపు



వ్యవస్థల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ డెలివరీలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

'సుఖోయ్-57' స్టెల్త్ ఫైటర్ జెట్

ఇక ఈ భేటీలో అత్యంత వ్యూహాత్మకమైన, ఆసక్తికరమైన అంశం, రష్యాకు చెందిన ఐదో తరం 'సుఖోయ్-57' (ఫ్రాబ-57) స్టెల్త్ ఫైటర్ జెట్. శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించగల ఈ అధునాతన యుద్ధ విమానాన్ని భారత్‌కు విక్రయించేందుకు రష్యా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వ్యూహం ఇక్కడ భిన్నంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా కేవలం కొనుగోలు దారుడిగా మిగిలిపోకుండా, టెక్నాలజీ బదిలీ జరగాలని భారత్ పట్టుబడుతోంది. అధునిక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, సెన్సార్ ఇంటిగ్రేషన్ ఇంజిన్ తయారీ వంటి అత్యంత సున్నితమైన సాంకేతికతను పంచుకోవడంపై ఇరు దేశాల శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, దేశీయ ఉత్పత్తి రంగంలో భారత్ ఒక భారీ ముందడుగు వేసినట్లే.

బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్

ఈ అజెండాలో ముచ్చటగా మూడో కీలక అంశం, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అప్‌గ్రేడ్. భారత్, రష్యాల ఉమ్మడి రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి ఈ క్షిపణి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ఇప్పటికే భూ, జల, వాయు మార్గాల నుంచి ప్రయోగించేలా బ్రహ్మోస్ సక్సెస్ అయింది. ఇప్పుడు దీని రేంజ్, ఫీచర్లను పెంచి మరింత ఆధునీకరించాలని రష్యా కోరుతోంది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయ డిఫెన్స్ మార్కెట్‌లో బ్రహ్మోస్‌ను ప్రధాన ఆకర్షణగా మార్చాలనేది ఇరు దేశాల ప్లాన్. ఇప్పటికే పలు దేశాలకు బ్రహ్మోస్ ఎగుమతులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ కొత్త అప్‌గ్రేడ్ భారత్‌ను గ్లోబల్ డిఫెన్స్ ఎగుమతిదారుగా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది.

దశాబ్దాలుగా రష్యా అంటే భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి కూడా భారత్ భారీగా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో రష్యా తన పాత పద్ధతులను మార్చుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ భారత్ లాంటి నమ్మకమైన భాగస్వామిని మరింత చేరువ చేసుకునేందుకు, ఏకంగా సాంకేతికతనే పంచుకోవడానికి రష్యా సిద్ధపడటం విశేషం. పాత ఆయుధాల స్థానంలో జాయింట్ ప్రొడక్షన్, కొత్త టెక్నాలజీ, దేశీయ తయారీ ఇవే భవిష్యత్ భారత్-రష్యా రక్షణ బంధానికి పునాది కానున్నాయి. అందుకే ఈ సెప్టెంబర్ 11న జరిగే సమావేశం, భారత భద్రతా ముఖచిత్రాన్ని మార్చే కీలక ఘట్టంగా మారబోతోంది.

ఈవీల కోసం ఎగబడుతున్న జనం

ముంబై : రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుపోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో



చూద్దాం.ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుపోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుపోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.

విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

అసలేంటి వివాదం?

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది.

సవరించిన పాఠ్య పుస్తకం

అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

ముగిసిన కేసు

కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా - ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు.2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు

'దైవ లీల'గా ప్రచారం

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది.ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి. పూర్తి భద్రత హామీ ఇచ్చే వరకు విగ్రహాన్ని కదిలించే ప్రయత్నం చేయకూడదు" అని ఆయన తెలిపారు.

చంద్రబాబు అరెస్ట్‌పై ప్రజల తీర్పు మరువలేనిది

కక్షపూరిత చర్యలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారు
ఎంపీ కేశినేని చిన్ని
'నిజం గెలిచింది' అంటూ కొవ్వొత్తులతో టీడీపీ నేతల నివాళి



విజయవాడ, మహానగర్

వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసి 53 రోజులు జైలులో నిర్బంధించిన రోజును గుర్తు చేసుకుంటూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం కొవ్వొత్తులు వెలిగించి 'నిజం గెలిచింది' అంటూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ చంద్రబాబుపై నాడు జరిగిన కక్షపూరిత చర్యలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. అరెస్ట్ సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా చంద్రబాబుకు మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రజా నేతను అరెస్ట్ చేసి 53 రోజులు జైలులో నిర్బంధించారని ఆరోపించారు. నాడు జరిగిన అన్యాయానికి ప్రజలు తమ ఓటుతో తగిన సమాధానం చెప్పారని, ప్రజల తీర్పుతో నిజం గెలిచిందన్నారు. చంద్రబాబుకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కుల పరిరక్షణకు టీడీపీ ఎప్పటికీ ముందుంటుందని, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, అమరావతి, పోలవరం, పారిశ్రామిక ప్రగతికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. 'నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం గెలిచింది.. తెలుగుజాతి ఆత్మగౌరవం గెలిచింది' అని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజు, గొట్టుముక్కల రఘురామరాజు, బొప్పన భవకుమార్, సుఖవాసి శ్రీనివాస్, చలసాని రమణ, చెన్నుపాటి ఉషారాణి, కరీముల్లా, దయాల శిరీష గాంధీ, పాల మాధవ, కుంచన దుర్గారావు, ఎర్నేని వేదవ్యాస్, సొంగ సంజయ్ వర్మ, మాదిగాని గురునాథం, కిలారు శ్రావణ్, దోమకొండ రవికుమార్, అబిద్ కోటా, శివలక్ష్మి, పామర్తి కిషోర్‌బాబు, కోనేరు కిషోర్, చరణ్ సాయి యాదవ్, పొట్లూరి దర్షిత్, వడ్లమూడి వంశీ, ఐటీడీపీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైకాపాలో ముదిరిన అంతర్గత విభేదాలు

- వంశీ అనుచరుడిపై సొంత పార్టీ నేత సంచలన ఆరోపణలు

గన్నవరం, మహానగర్



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ముఖ్య అనుచరుడిగా పేర్కొంటున్న ఓలుపల్లి మోహన్‌రంగాను పార్టీకి దూరంగా పెట్టాలని జడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు ఎండీ గౌసాని చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2019లో వల్లభనేని వంశీ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం నియోజకవర్గ బాధ్యతలను మోహన్‌రంగాకు, పార్టీ కార్యాలయ నిర్వహణ బాధ్యతలను మరో అనుచరుడు మేచినేని బాబుకు అప్పగించారని గౌసాని ఆరోపించారు. ఆ తర్వాత గన్నవరం నియోజకవర్గంలో అరాచకాలు పెరిగాయని విమర్శించారు. నాలుగు మండలాల్లో అధికారులు, కొందరు స్థానిక నాయకులను అడ్డం పెట్టుకుని అక్రమ మైనింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు సాగించారని, వాటి ద్వారా మోహన్‌రంగా భారీగా ఆర్థికంగా లబ్ధి పొందారని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా ధ్రువీకరించిన ఆధారాలు వెల్లడికాలేదు. గతంలో గన్నవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం, ఆ పార్టీ నేత జాస్తి వెంకటేశ్వరరావు నివాసంపై జరిగిన దాడుల అంశాన్ని కూడా గౌసాని ప్రస్తావిస్తూ.. ఆ ఘటనల వెనుక మోహన్‌రంగానే ప్రధాన సూత్రధారి అని ఆరోపించారు. సొంత పార్టీకి చెందిన నేతే పార్టీ ముఖ్య అనుచరుడిపై ఈ స్థాయిలో ఆరోపణలు చేయడం గన్నవరం వైకాపాలో నెలకొన్న అంతర్గత విభేదాలను మరోసారి తెరపైకి తెచ్చింది. గౌసాని చేసిన ఆరోపణలపై మోహన్‌రంగా, వైకాపా నాయకత్వం స్పందించాల్సి ఉంది.

పృథ్వీశ్వరస్వామికి విశేష పూజలు



చల్లపల్లి, మహానగర్



ద్వాపర యుగం నాటి ప్రాచీన శైవక్షేత్రంగా, పశ్చిమాభిముఖంగా కొలువైన అరుదైన పుణ్యక్షేత్రం నడకుదురు శ్రీ పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ సమగ్ర అభివృద్ధి ప్రదాత మండవ రవీంద్ర ఆధ్వర్యంలో భక్తుల భాగస్వామ్యంతో స్వామివారికి 108 కిలోల భస్మంతో భస్మాభిషేకం, శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి 108 కిలోల కుంకుమతో అభిషేకం, విశేష అలంకరణ నిర్వహించారు. దేవస్థాన వంశపారంపర్య అర్చకులు కంఠంరాజు సాయిబాబు (గణపతి దీక్షితులు), కంఠంరాజు సురేంద్ర పృథ్వీకుమారశర్మ, కంఠంరాజు శంకర్ ఆధ్వర్యంలో శ్వేతవర్ణ రూపుదాల్చిన పృథ్వీశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో పలు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తరించారు.

మంగినపూడి బీచ్‌లో మహాగణపతి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- **భక్తుల భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**
- **14 రోజుల పాటు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించాలి**
- **ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి**
- **జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



మచిలీపట్నం, మహానగర్

మంగినపూడి బీచ్ సాగర తీరంలో 63 అడుగుల ఎత్తైన మహాగణపతి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 14 రోజుల పాటు నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఉత్సవాల ఏర్పాట్లను సమీక్షించారు. 14 రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే ఏర్పాటు చేసి రద్దీ నియంత్రించాలని సూచించారు. గత బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఎదురైన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నం--మంగినపూడి ప్రధాన మార్గానికి ప్రత్యామ్నాయంగా గుర్తించిన రహదారిని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. సముద్రంలోకి భక్తులు వెళ్లకుండా బారికేడింగ్ ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లు, లైఫ్‌బాయ్‌లు, లైఫ్‌జాకెట్లు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉత్సవ ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలు, పరికరాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. 14 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం స్థానిక కళాబృందాలు, నృత్య బృందాలు, నాటక బృందాలు, కళాజాత, కూచిపూడి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్‌కు భక్తుల రాకపోకలకు ప్రతి అరగంటకు ప్రత్యేక బస్సులు నడపాలని, రద్దీని బట్టి బస్సుల సంఖ్య పెంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

సర్వీస్ ఇనాం భూములపై నిషేధం ఎత్తివేయాలి

పదేళ్లుగా పడుతున్న క్షోభకు నష్టపరిహారం ఇవ్వాలి
రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ధరణికోట వెంకటరమణ డిమాండ్



జగ్గయ్యపేట, మహానగర్

సర్వీస్ ఇనాం భూములపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని బేషరతుగా ఎత్తివేయాలని రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు, విద్యావేత్త ధరణికోట వెంకటరమణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంలో జాప్యం కారణంగా పదేళ్లుగా ఇనాం భూముల బాధితులు పడుతున్న మానసిక వేదనకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఇనాం భూ బాధితుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న మూడో రోజు రిలే నిరాహార దీక్షలను ధరణికోట వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తప్పిదానికి ప్రభుత్వమే బాధ్యత వహించి భూములపై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరారు. పదేళ్లుగా ప్రభుత్వాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. జగ్గయ్యపేటలోని 900 రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు బాధితులకు మద్దతుగా ఉంటాయని తెలిపారు. కాగా, తమ సమస్యను పరిష్కరిస్తామని పదేళ్లుగా ప్రభుత్వాలు హామీలతో కాలయాపన చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇనాం భూ బాధితులు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇనాం భూ బాధితుల సంఘం ప్రతినిధులు ఎలవర్తి అచ్యుతురామయ్య, గద్దె సుధీర్, కాకరపర్తి వెంకట రమేష్, కుక్కడపు ప్రసాద్, నూకల బాలకృష్ణ, కళ్యాణం మురళి, యలవర్తి శరత్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు బి.వి.సత్యనారాయణ, శ్రీకాంత్, జీవరత్నం, దానయ్య, భాగ్యరాజా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శోభనాచల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఆగిరిపల్లి, మహానగర్

జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, అభివృద్ధే లక్ష్యంగా శ్రీ శోభనాచల ప్రెస్‌క్లబ్ పనిచేస్తుందని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి, అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని, అన్ని విధాలా జర్నలిస్టు సోదరులకు అండగా ఉంటామని తెలిపారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా ఆర్.వి.ఎన్. రాజశేఖర్, మంగళపూడి నాగేశ్వరరావు, కొల్లూరి ఐజక్ జాన్, అధ్యక్షులుగా నంజం రామకృష్ణ, కోశాధికారిగా తవ్వా మురళీధర్, ఉపాధ్యక్షులుగా అసానుబాదు నాగరాజు, చిమట సుబ్బారావు, పెనుముచ్చు శేఖర్, కె.వి.ఎస్.ఎస్. రాధాకృష్ణ, కార్యదర్శులుగా ప్రత్తిపాటి సురేష్ కుమార్, వంగా రవికుమార్, పల్లగాని రాంబాబు, సయ్యద్ రషీద్, జూలూరి కోటేశ్వరరావుతో పాటు మరో పది మంది సభ్యులు ఎన్నికయ్యారు.

యువత నొప్పులకు 'జండు' పరిష్కారం

గుంటూరు

ఆధునిక జీవనశైలితో యువత ఎదుర్కొంటున్న నొప్పులు, అలసటను దృష్టిలో పెట్టుకుని జండు బామ్ కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'నొప్పిని అన్‌డూ చేయండి' అనే సందేశంతో రూపొందించిన ఈ ప్రచారం ద్వారా ఎక్కువసేపు తెరలను చూడటం వల్ల వచ్చే తలనొప్పి, మెడ నొప్పి, వరుసగా సామాజిక మాధ్యమాలను చూస్తూ ఉండటం వల్ల కలిగే అలసట వంటి సమస్యలను ప్రస్తావిస్తోంది. ఇమామి లిమిటెడ్‌కు చెందిన జండు బామ్.. 'నొప్పుల ప్రపంచం' అనే ఊహాజనిత నేపథ్యంతో ఆధునిక జీవితంలోని ఇబ్బందులను హాస్యభరితంగా చూపించింది. యువత ఎదుర్కొనే ఉద్యోగ ఒత్తిడి, పని అలసట, అతిగా ఆలోచించడం, సంబంధాల్లోని సమస్యలు, సోమవారం తిరిగి పనికి వెళ్లాలనే ఆందోళన వంటి అంశాలను కూడా ప్రచారంలో ప్రస్తావించింది. 'జండుతో నొప్పిని అన్‌డూ చేయండి' అనే సందేశంతో ఉత్పత్తి ప్రయోజనాన్ని సమకాలీన జీవనశైలితో అనుసంధానించింది. 16--28 ఏళ్ల యువతతో మరింతగా అనుసంధానం కావడమే ఈ ప్రచారం ప్రధాన లక్ష్యమని సంస్థ తెలిపింది. చెట్లు కమ్యూనికేషన్స్ రూపొందించిన ఈ ప్రచారం టెలివిజన్, డిజిటల్, ఓటీటీ, సామాజిక మాధ్యమాల వేదికలపై మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతోంది.

అగ్నిప్రమాద బాధితులకు దాతల చేయూత

- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిత్యావసర సామాగ్రి పంపిణీ



ఘంటసాల, మహానగర్

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ, దాతలు బుధవారం చేయూతనందించారు. ఘంటసాల మండలం లంకపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరుపేద ముస్లింలు షేక్ సలీమ్, మహమ్మద్ రఫీలకు చెందిన పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, జిల్లా కోఆర్డినేటర్ కళ్లేపల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో స్టీల్ వంటపాత్రల సెట్లు, హెవీ టార్పాలిన్లు, రగ్గులను రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ద్వారా ఘంటసాల తహసీల్దార్, రెడ్‌క్రాస్ మండల అధ్యక్షులు వీ. విజయప్రసాద్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గువ్వాబత్తిన నాగేశ్వరరావు 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద బాధితులు తమకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయాలని తహసీల్దార్ విజయప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దిరిశం వెంకట్రావు, రెడ్‌క్రాస్ చల్లపల్లి శాఖ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ట్రెజరర్ ఎండీ.ఏ.కే. జిలాని, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కావూరి సాల్మన్‌రాజు, బీవీకేవీ ప్రసాద్, వీఆర్వో శివకుమార్‌రాజు పాల్గొన్నారు.

బిజినెస్

భారీగా నష్టపోయిన స్టాక్‌మార్కెట్..

సెన్సెక్స్ 813 పాయింట్లు పతనం



భారత స్టాక్ మార్కెట్ బుధవారం భారీగా నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 813 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 203 పాయింట్లు నష్టపోయింది. బుధవారం ఉదయం ట్రేడింగ్ నష్టాల్లోనే మొదలైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 75,216.22 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరకు 813.35 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ 74,764.23 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 203.60 పాయింట్లు నష్టపోయి 23,431.50 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 షేర్ ఇండెక్స్‌లో టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఏసియన్ పెయింట్స్, ఎన్టీపీసీ, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. మరోవైపు మారుతి, ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లో నిఫ్టీ 100 షేర్ 0.72 శాతం, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.24 శాతం, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.79 శాతం పడిపోయాయి. ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు అత్యధికంగా 4.55 శాతం పతనమయ్యాయి. ఇన్ఫోసిస్ షేర్లు 4.43 శాతం, టెక్ మహీంద్రా షేర్లు 3.87 శాతం, టీసీఎస్ షేర్లు 2.26 శాతం పనతమయ్యాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 99.60 డాలర్లకు చేరింది. అమెరికా-ఇరాన్ యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, సౌదీపై హౌతీ ఉగ్రవాదులు దాడి చేయడం వంటి కారణాల వల్ల క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్ లాభాల్లో ముగియగా.. హాంకాంగ్ సెంగ్ ఇండెక్స్ నష్టాల్లో ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.11 వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్లో 4,391.07 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

ఫిలిప్స్ నుంచి 5జీ స్మార్ట్‌ఫోన్ విడుదల..

ధర బడ్జెట్‌లోనే.. ఫీచర్లు ఇవే



ఎలక్ట్రానిక్ రంగంలో ఫిలిప్స్ సంస్థకు ఉన్న ప్రత్యేక స్థానం ఉంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఫిలిప్స్ నుంచి తాజాగా మొదటి స్మార్ట్‌ఫోన్ విడుదలైంది. ఇది 5జీ ఫోన్. ఫిలిప్స్ ఎస్7221 పేరుతో 5జీ ఫోన్‌ను ఇటీవలే మార్కెట్లోకి విడుదల చేసింది. బడ్జెట్ ధరలోనే ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. అమెజాన్ స్టోర్‌లో ఈ ఫోన్ అందుబాటులో ఉంది. బ్లాక్, బ్లూ, సిల్వర్ కలర్స్‌లో లభ్యం. ఈ ఫోన్‌లోని కీలక ఫీచర్లివి. 6.67 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120 హెర్జ్ రిఫ్రెషరేట్, యునిసాక్ టీ765 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 ఓఎస్, సైడ్ మౌంట్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్, 210 గ్రాముల బరువు, 5,700 ఎంఏహెచ్ బ్యాటరీ, 25 వాట్స్ ఫాస్ట్ ఛార్జర్, డ్యుయల్ 5జీ ఫోన్, ఐపీ 64 రేటింగ్, 64 ఎంపీ మెయిన్ కెమెరా, 16 ఎంపీ సెల్ఫీ కెమెరా, 6జీబీ+128జీబీ, 8జీబీ+128జీబీ వంటి ఫీచర్లున్నాయి. ఫోన్‌తోపాటు ఛార్జర్, స్క్రీన్ ప్రొటెక్టర్, ప్రొటెక్ట్ కేస్ వంటివి కూడా అందిస్తోంది కంపెనీ. ధరలు వేరియెంట్‌ను బట్టి రూ.20,499, రూ.22,499.

రూ.269 కోట్ల ఆఫీస్ లీజు..

ఐటీ కంపెనీ భారీ డీల్



గ్లోబల్ టెక్నాలజీ, కన్సల్టింగ్ సంస్థ యాక్సెంచర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో భారీ ఆఫీస్ లీజింగ్ డీల్ కుదుర్చుకుంది. థానేలోని హీరానందాని ఎస్టేట్‌లో ఉన్న 'సెంటారస్' కమర్షియల్ టవర్‌లో సుమారు 2.72 లక్షల చదరపు అడుగుల గ్రేడ్-ఏ కార్యాలయ స్థలాన్ని 10 ఏళ్లకు లీజుకు తీసుకుంది. ఈ ఒప్పందం మొత్తం విలువ దాదాపు రూ.269 కోట్లుగా ఉంది. నెలవారీ అద్దె సుమారు రూ.1.9 కోట్లుగా ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ కార్యాలయ స్థలం 'హౌస్ ఆఫ్ హీరానందాని' అభివృద్ధి చేసిన హీరానందాని ఎస్టేట్ టౌన్‌షిప్‌లోని సెంటారస్ టవర్‌లో ఉంది. ఈ భవనంలోని మూడు పక్కపక్కనే ఉన్న అంతస్తుల్లో యాక్సెంచర్ కార్యకలాపాలు నిర్వహించనుంది. ఈ లీజింగ్ ఒప్పందాన్ని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా కుదిర్చింది. ఈ ఏడాది థానేలో నమోదైన అతిపెద్ద కార్యాలయ లావాదేవీల్లో ఇది ఒకటిగా నిలిచింది. 21 అంతస్తుల సెంటారస్ భవనంలో మొత్తం నిర్మిత విస్తీర్ణం సుమారు 19 లక్షల చదరపు అడుగులు. హీరానందాని ఎస్టేట్‌లోని 375 ఎకరాల టౌన్‌షిప్‌లో ఈ వాణిజ్య ప్రాజెక్టు ఉంది. ఇప్పటికే ఇక్కడ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), బీఎన్‌పీ పరిబాస్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బేయర్ క్రాప్‌సైన్స్, వీవర్క్ వంటి ప్రముఖ సంస్థలు కార్యాలయాలను నిర్వహిస్తున్నాయి. పెద్ద కంపెనీలు ముంబై ప్రధాన ప్రాంతాలతో పాటు థానే, నవి ముంబై వంటి అభివృద్ధి చెందుతున్న వాణిజ్య ప్రాంతాల్లో భారీ కార్యాలయ స్థలాలను ఎంచుకుంటుండటానికి ఈ ఒప్పందం మరో ఉదాహరణ. ముఖ్యంగా ప్రతిభావంతులైన ఉద్యోగుల లభ్యత, మౌలిక సదుపాయాలు, ఖర్చుల పరంగా అనుకూలత వంటి అంశాలు ఈ ప్రాంతాలపై సంస్థల ఆసక్తిని పెంచుతున్నాయి. తాజా మార్కెట్ గణాంకాలు కూడా ముంబై ఆఫీస్ మార్కెట్‌లో డిమాండ్ కొనసాగుతున్నట్లు సూచిస్తున్నాయి. జేఎల్ఎల్ డేటా ప్రకారం 2026 జనవరి--జూన్ మధ్య ముంబైలో మొత్తం ఆఫీస్ లీజింగ్ 5.88 మిలియన్ చదరపు అడుగులకు చేరింది. ఇది 2025 ఇదే కాలంలోని 4.99 మిలియన్ చదరపు అడుగులతో పోలిస్తే 18 శాతం అధికం.

ఏఐతో మానవాళికి ముప్పు

వచ్చే పదేళ్లలో తీవ్ర పరిణామాలు- ఇవాన్ హుబింగర్



ఇంటర్నెట్ డెస్క్: కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రానున్న పదేళ్లలో 10 శాతానికి పైగా మనుషులు ఏఐ కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ హెచ్చరించారు. ప్రస్తుతం ఈ ముప్పు తక్కువగానే ఉందని.. ఒకవేళ ఏఐ తనను తాను మెరుగుపరుచుకునే స్థాయికి చేరితే మాత్రం పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. సాధ్యమైనంత వరకు ఆంథ్రోపిక్ దీనిని ఎదుర్కొనేందుకు కృషి చేస్తుందని చెప్పారు. సూపర్ ఇంటెలిజెన్స్‌తో వచ్చే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు స్పష్టమైన ప్రణాళికలు లేవని హుబింగర్ తెలిపారు. ఏఐ అభివృద్ధికి తగ్గట్లుగా.. అదే స్థాయిలో భద్రతాపరమైన చర్యలు కొనసాగడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు.. ఓపెన్ ఏఐ ప్రధాన శాస్త్రవేత్త జాకబ్ పచోచ్కి ఏఐ పురోగతిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ మానవుల నియంత్రణలోనే ఉండాలన్నారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏఐ వ్యవస్థలు వాటంతటా అవే పనులు చేసే సామర్థ్యం పెరగడమే ఈ ఆందోళనలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. తగిన నియంత్రణ లేకపోతే భవిష్యత్తులో ఏఐని అదుపు చేయడం కష్టమేనని హెచ్చరిస్తున్నారు. ఇటీవల అమెరికాలో 1,300 మంది ఏఐ రంగ నిపుణులు.. ఏఐ వ్యవస్థలు సమాజానికి ముప్పుగా మారకుండా అంతర్జాతీయ స్థాయిలో భద్రతా నిబంధనలు తీసుకురావాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ ప్రయత్నానికి యూఎస్ ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ లేఖపై ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అగ్రశ్రేణి ఏఐ ల్యాబ్స్, ఐటీ కంపెనీలకు చెందిన పరిశోధకులు, ఇంజినీర్లు, ఉద్యోగులు సంతకం చేశారు.

కాషాయం వద్దు.. నీలమే ముద్దు..

జెర్సీలపై యూటర్న్ తీసుకున్న భారత హాకీ జట్లు



న్యూఢిల్లీ: భారత హాకీ జట్ల జెర్సీ రంగుపై హాకీ ఇండియా (హెచ్ఐ)యూ టర్న్ తీసుకుంది. వివాదం రేపిన కాషాయ రంగుకు స్వస్తి పలికి తిరిగి సంప్రదాయ నీలి రంగు జెర్సీలనే వాడాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. రాబోయే ఆసియా గేమ్స్‌లో భారత జట్లకు తొలి ప్రాధాన్యతగా బ్లూ కలర్ జెర్సీలనే ఎంచుకుంది. గత నెలలో జరిగిన హాకీ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల, మహిళలు జట్లు ఆరెంజ్ జెర్సీలతో బరిలోకి దిగడంపై తీవ్ర విమర్శలు, వ్యతిరేకత వచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నో ఏండ్ల నుంచి ఉపయోగిస్తున్న నీలంను కాదని కాషాయ రంగును ఎంచుకోవడాన్ని మాజీ కెప్టెన్ వీరెన్ రాస్కిన్హా తదితరులు ప్రశ్నించారు. భారత నీలి రంగు కిట్స్.. బ్లూ సింథటిక్ ఫీల్డ్ కలర్‌లో కలిసిపోతున్నాయనే కాషాయానికి మొగ్గు చూపినట్టు తర్వాత హాకీ ఇండియా వివరణ ఇచ్చినా.. విమర్శలు ఆగలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 19 నుంచి జపాన్ ఆతిథ్యం ఇచ్చే ఆసియా గేమ్స్‌లో హాకీ టీమ్స్ ఫస్ట్ చాయిస్‌గా బ్లూ కలర్ కిట్స్‌నే ఎంపిక చేసినట్టు భారత ఒలింపిక్ సంఘానికి హెచ్ఐ తెలిపింది. రెండో ప్రాధాన్యతగా కాషాయ రంగును ఎంచుకున్నట్టు హెచ్ఐ కోశాధికారి శేఖర్ మనోహరన్ తెలిపారు.

స్పోర్ట్స్

వన్డే అరంగేట్రంలోనే ప్రపంచ రికార్డు సమం



సౌతాఫ్రికా ఓపెనర్ జోర్డాన్ హెర్మాన్ తన వన్డే అరంగేట్రంలోనే భారీ ప్రపంచ రికార్డును సమం చేశాడు. బుధవారం నమీబియాతో తొలి వన్డే మ్యాచ్‌లో 24 ఏళ్ల హెర్మాన్ అరంగేట్రం చేశాడు. ఆడుతున్నది తొలి మ్యాచే అయినా ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా చెలరేగిపోయాడు ఈ బ్యాటర్. జోర్డాన్ హెర్మాన్ (150; 126 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌లు) బాదేశాడు. దీంతో వన్డే అరంగేట్రంలో అత్యధిక స్కోరు చేసిన తన దేశానికే చెందిన మాథ్యూ బ్రిట్జ్కే రికార్డును సమం చేశాడు. బ్రిట్జ్కే గతేడాది ముక్కోణపు సిరీస్‌లో లాహోర్‌లో న్యూజిలాండ్‌పై తన వన్డే అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్‌లో బ్రిట్జ్కే (150; 148 బంతుల్లో) పరుగులు చేసి వన్డే అరంగేట్రంలో అత్యధిక స్కోరు చేసిన ప్లేయర్‌గా వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు దాన్ని హెర్మాన్ సమం చేశాడు. నమీబియాతో మ్యాచ్‌లో ఓపెనర్‌గా వచ్చిన జోర్డాన్ హెర్మాన్.. టోని డిజోర్జి (72)తో కలిసి రెండో వికెట్‌కు 190 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. 61 బంతుల్లో హాఫ్ సెంచరీ.. 93 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. 125 బంతుల్లో 150 పరుగులు పూర్తి చేసుకుని తర్వాత బంతికే ఔటయ్యాడు. మరొక పరుగు చేసి ఉంటే బ్రిట్జ్కే రికార్డును బద్దలు కొట్టేవాడు. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 348 పరుగులు చేసింది.

584 పరుగుల ఆధిక్యం..

టైటిల్‌కు అడుగు దూరంలో ఈస్ట్‌జోన్!



దులీప్ ట్రోఫీని అందుకునేందుకు ఈస్ట్‌జోన్ జట్టు అడుగుదూరంలో నిలిచింది. సౌత్‌జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో నాలుగోరోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్‌జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 51 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుషాగ్ర (34), ఖురేషీ (26) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం ఈస్ట్‌జోన్ 584 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది. గురువారం ఆటకు చివరి రోజు కావడంతో ఈస్ట్‌జోన్ గెలుపు లాంఛనమే. ఐదోరోజు ఉదయం సెషన్‌లో వేగంగా బ్యాటింగ్ చేసి సౌత్‌జోన్ ముంగిట 650 పరుగుల లక్ష్యాన్ని టార్గెట్‌గా ఉంచే అవకాశముంది. ఇంత టార్గెట్ ఛేదించడం అసాధ్యం కాబట్టి మ్యాచ్ డ్రా అవనుంది. దీంతో నిబంధనల ప్రకారం తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన ఈస్ట్‌జోన్ విజేతగా నిలవనుంది. దీంతో 13 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీలో ఫైనల్ చేరిన ఈస్ట్‌జోన్ చాంపియన్‌గా నిలిచేందుకు అడుగుదూరంలో ఉంది. తొలి ఇన్నింగ్స్ మాదిరే రెండో ఇన్నింగ్స్‌ను వేగంగా ఆరంభించిన ఈస్ట్‌జోన్‌కు ఓపెనర్లు వైభవ్ (8), అభిమన్యు ఈశ్వరన్ (3) శుభారంభం అందించలేకపోయారు. అయితే మిడిలార్డర్‌లో శిఖర్ మోహన్ (52), కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), కుమార్ కుషాగ్ర (34) రాణించడంతో ఈస్ట్‌జోన్ 200 పరుగుల మార్క్‌ను దాటింది. సౌత్‌జోన్ బౌలర్లలో సిరాజ్, త్రిపురానా విజయ్, నిదీష్, షేక్ రషీద్‌లు తలా ఒక వికెట్ తీశారు. అంతకముందు సౌత్‌జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 336 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ (99) సెంచరీ చేజార్చుకోగా, పడిక్కల్ (62), సీవీ మిలింద్ (43) పర్వాలేదనిపించారు. ముఖేశ్‌కుమార్ 3 వికెట్లు తీయగా, షమీ, ఖురేషీ, శికర్ మోహన్‌లు తలా 2 వికెట్లు పడగొట్టారు.




బాలయ్య-కొరటాల మూవీలో ఇద్దరు ఐశ్వర్యలు.. మేకోవర్ చూస్తే షాకే!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దేవర' తర్వాత కొరటాల శివ రూపొందించనున్న ఈ చిత్రం బాలయ్య కెరీర్‌లో మరో ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు ఆసక్తికరమైన వార్తలు ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా బాలకృష్ణ ఈ సినిమాలో ఇప్పటివరకు చూడని సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారనే టాక్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. బాలకృష్ణను మాస్ యాక్షన్ హీరోగా అద్భుతంగా ప్రెజెంట్ చేయడంలో దర్శకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంటారు. అయితే కొరటాల శివ మాత్రం ఈసారి బాలయ్యను కేవలం మాస్ యాంగిల్‌కే పరిమితం చేయకుండా.. ఆయన పాత్రలో కొత్త షేడ్స్‌ను చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది. సామాజిక అంశాలు, కుటుంబ భావోద్వేగాలను కమర్షియల్ ఎలిమెంట్స్‌తో మేళవించడం కొరటాల శివ శైలి. ఈ సినిమాలోనూ అదే తరహాలో యూనివర్సల్ ఎమోషన్‌తో కూడిన కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ భారీ చిత్రానికి సంబంధించిన తొలి షూటింగ్ షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అయితే మొదటి షెడ్యూల్‌లో బాలకృష్ణ పాల్గొనరనే టాక్ వినిపిస్తోంది.బాలయ్య లేకుండా కీలకమైన సన్నివేశాలతో పాటు భారీ యాక్షన్ ఎపిసోడ్లను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది.దాదాపు 15 రోజుల పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే విషయంపై కొంతకాలంగా ఆసక్తి కొనసాగుతోంది. తాజాగా మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి పేరును దాదాపు ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.వైద్యురాలిగా పనిచేసిన ఐశ్వర్య లక్ష్మి.. నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చి మలయాళం, తమిళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు'లోనూ ఆమె కీలక పాత్రలో కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ సరసన నటించే అవకాశం దక్కితే ఆమె కెరీర్‌కు ఇది మరో కీలక మలుపుగా మారే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ సినిమాలో మరో కీలకమైన పాత్ర కోసం నటి ఐశ్వర్య రాజేష్ పేరు కూడా వినిపిస్తోంది. ఆమెను రెగ్యులర్ హీరోయిన్ పాత్రలో కాకుండా లేడీ విలన్‌గా సరికొత్త నెగెటివ్ షేడ్‌లో చూపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే హీరోయిన్, లేడీ విలన్ పాత్రలకు సంబంధించిన ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

రామాయణకు గాడ్జిల్లా మైనస్ జీరో దెబ్బ

ఐమ్యాక్స్ స్క్రీన్ల కోసం గ్లోబల్ వార్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో 'రామాయణ: పార్ట్ 1' ఒకటి. భారతీయ పురాణ ఇతిహాసం రామాయణాన్ని అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, యష్ రావణుడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా విజువల్ గ్రాండియర్‌గా తెరకెక్కుతోంది. నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.అదే తేదీన జపాన్‌కు చెందిన మరో భారీ చిత్రం 'గాడ్జిల్లా మైనస్ జీరో' కూడా అంతర్జాతీయ మార్కెట్లలోకి రాబోతోంది. 'గాడ్జిల్లా మైనస్ వన్'కు కొనసాగింపుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తకాషి యమజాకి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. దీంతో రామాయణ--గాడ్జిల్లా మధ్య పోటీ ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రెండు పెద్ద సినిమాలు ఒకే రోజు విడుదలైతే థియేటర్లు, ఆడియెన్స్, బాక్సాఫీస్ వసూళ్ల కోసం పోటీ ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. కారణం.. రెండు సినిమాలూ ప్రీమియం ఐమ్యాక్స్ అనుభూతిని దృష్టిలో పెట్టుకుని రూపొందిన భారీ విజువల్ చిత్రాలు కావడమే. ముఖ్యంగా 'గాడ్జిల్లా మైనస్ జీరో'ను జపాన్‌లో ఐమాక్స్ కోసం ప్రత్యేకంగా చిత్రీకరించిన తొలి జపనీస్ ప్రొడక్షన్‌గా అధికారికంగా ప్రచారం చేస్తున్నారు. ఐమాక్స్ స్క్రీన్లపై విజువల్స్, సౌండ్‌ను మరింత విస్తృతంగా ఆస్వాదించేలా సినిమాను రూపొందించినట్లు చిత్రబృందం చెబుతోంది.ఇక 'రామాయణ' కూడా ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో.. ముఖ్యంగా నార్త్ అమెరికా వంటి ఓవర్సీస్ మార్కెట్లలో ఐమాక్స్ స్క్రీన్ల కేటాయింపు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. 'గాడ్జిల్లా మైనస్ జీరో' తాజా ట్రైలర్ విడుదలైన తర్వాత ఈ పోటీపై చర్చ మరింత పెరిగింది. ట్రైలర్‌లో భారీ విజువల్స్, గాడ్జిల్లా విధ్వంసం, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను ఆకట్టుకునేలా కనిపించడంతో సినిమాపై అంతర్జాతీయంగా ఆసక్తి పెరుగుతోంది.

రూ.200 కోట్ల 'ఇరుముడి' ఓటీటీలోకి..

రవితేజ బ్లాక్‌బస్టర్ ఎక్కడ, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అంటే?

ఓటీటీ ప్రేక్షకులకు అదిరిపోయే గుడ్‌న్యూస్. థియేటర్లలో సంచలన విజయాన్ని అందుకున్న మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సత్తా చాటింది. ముఖ్యంగా రవితేజను మాస్ హీరోగా మాత్రమే కాకుండా ఒక బలమైన ఎమోషనల్ నటుడిగా చూపించిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ఇప్పుడు థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి ఎమోషనల్ కథలను తెరకెక్కించిన దర్శకుడు శివ నిర్వాణ.. రవితేజతో 'ఇరుముడి'ని తెరకెక్కించారు. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ పబ్లిక్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు స్థిరంగా కొనసాగాయి. ఇతర సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ.. 'ఇరుముడి' మాత్రం సుదీర్ఘంగా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు సమాచారం. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా మరో భారీ విజయంగా నిలిచింది. రవితేజ అంటే మాస్, కామెడీ, ఎనర్జిటిక్ యాక్షన్ అనే ఇమేజ్ ప్రేక్షకుల్లో బలంగా ఉంది. అయితే 'ఇరుముడి'లో శివ నిర్వాణ ఆయనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, భావోద్వేగాల చుట్టూ కథను నడిపించిన తీరు ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా రవితేజ నటనలోని ఎమోషనల్ షేడ్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'ఇరుముడి' డిజిటల్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సెప్టెంబర్ 18 నుంచి ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. అయితే స్ట్రీమింగ్ తేదీ, భాషల వివరాలపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో 'ఇరుముడి'కి ప్రధాన బలంగా నిలిచిన అంశాల్లో రవితేజ నటనతో పాటు చిన్నారి నక్షత్రతో ఆయనకు సంబంధించిన ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉన్నాయి. ఈ సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించాయని టాక్ వచ్చింది.

ఘనంగా 'కళ్యాణం కమనీయం జీవితం' ట్రైలర్ లాంచ్.. ఈ నెల 18న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్!





టాలీవుడ్‌లో ప్రతిభావంతులైన యువ నటీనటులు, కొత్త ఆలోచనలతో వస్తున్న టెక్నీషియన్లను ప్రోత్సహించే చిత్రాలకు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆ కోవలోనే యూత్ మరియు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఏకకాలంలో అలరించే సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోన్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం". వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించారు. రవి లోకిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఖాన్ దురాని, సాహితి ఆవంచ జంటగా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఈ నెల 18న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ రాజవంశీ అత్యంత భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖ స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్, ప్రముఖ నిర్మాతలు కేఎల్ దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి సందడి చేశారు. ఈ వేడుకలో చిత్ర బృందం పంచుకున్న ఆసక్తికర విశేషాలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. సమాజంలో నేడు సర్వసాధారణంగా మారుతున్న భార్యాభర్తల బంధాలు, వాటి మధ్యలోకి ఒక మూడో వ్యక్తి ప్రవేశం వల్ల వచ్చే మనస్పర్థలు, ఆ సవాళ్లను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమను, బంధాన్ని ఎలా నిలబెట్టుకున్నారు అనే సున్నితమైన భావోద్వేగాల సమాహారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఎక్కడా అసభ్యతకు తావులేకుండా, కుటుంబం అంతా కలిసి నవ్వుతూ, భావోద్వేగానికి గురవుతూ చూసేలా ఈ క్లీన్ ఫ్యామిలీ అండ్ లవ్ ఎంటర్‌టైనర్‌ను రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. ఈ వేడుకలో నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ, తాము యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడినప్పటికీ సినిమాపై ఉన్న మక్కువతో గతంలో '24 కిస్సెస్' చిత్రాన్ని నిర్మించామని, ఇప్పుడు కొత్తవారితో మరింత ఇన్నోవేటివ్ కంటెంట్‌ను ప్రేక్షకులకు అందించాలనే తపనతో ఈ సినిమా చేశామని తెలిపారు. వ్యాపార లెక్కలకంటే మంచి సినిమా తీయాలనే ప్యాషన్‌తో పనిచేశామని, ఈ చిత్రంలోని లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను కచ్చితంగా కదిలిస్తాయని పేర్కొన్నారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999